పరిపాలనలో విప్లవాత్మక మార్పులు

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనా విధానంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి, దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఆయన సమావేశం నిర్వహించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపటడం కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ప్రజల జీవనశైలిలో మార్పులు తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే కిలారి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న గ్రామ సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు ఇతర రాష్ట్రాల్లో కూడా అమలుకు శ్రీకారం చుట్టారని, కేంద్ర ప్రభుత్వం కూడా పరిశీలించి ప్రశంసించినట్లు తెలిపారు. పొన్నూరు నియోజకవర్గంలో రూ.1,600 కోట్లతో ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో అందించినట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లాగా కృషి చేయాలని ఎమ్మెల్యే వెంకట రోశయ్య పిలుపునిచ్చారు. పార్టీ క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు వైఎస్సార్ సీపీ తరుపున రూ.10లక్షల ఇన్సూరెన్స్ పాలసీ స్కీంను అందజేస్తున్న విధానాన్ని ఆయన తెలియజేశారు. సమావేశంలో పొన్నూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు అన్నాబత్తుని సదాశివరావు, గుత్తికొండ అంజిరెడ్డి హాజరయ్యారు. పెదకాకాని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, కారుమూరి రాజేంద్ర, శ్రీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లౌడ్ కంప్యూటింగ్‌తో ఐటీ సేవలు సులభతరం

స్మార్ట్ బ్రిడ్జ్ అకడమిక్ ఇనిషియేటివ్ డైరెక్టర్ యుక్తేష్ చింతమడాక



వర్సిటీలో విద్యార్థులతో మాట్లాడుతున్న యుక్తేష్ చింతమడాక

చేబ్రోలు: క్లౌడ్ కంప్యూటింగ్ ద్వారా ఐటీ సేవలను సులభతరం చేయవచ్చని బెంగళూరులోని స్మార్ట్ బ్రిడ్జ్ అకడమిక్ ఇనిషియేటివ్ డైరెక్టర్ యుక్తేష్ చింతమడాక అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'క్లౌడ్ యాప్ డెవలప్‌మెంట్ విత్ రెడ్‌హాట్ ఓపెన్ షిఫ్ట్' అనే అంశంపై ఐదు రోజుల ఇన్-పర్సన్ ఫ్యాకల్టీ బిల్డ్‌థాన్ ప్రోగ్రాం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. యుక్తేష్ మాట్లాడుతూ క్లౌడ్ కంప్యూటింగ్ అంటే ఇంటర్నెట్ లేదా ఇతర రిమోట్ సర్వర్ల ద్వారా సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సేవలను పొందడమని తెలిపారు. ఇంటర్నెట్ కనెక్షన్ ఉంటే క్లౌడ్ కంప్యూటింగ్ ద్వారా ప్రపంచంలోని ఏమూలన ఉన్న డేటా, సమాచారం, అప్లికేషన్ అయినా పొందవచ్చని వెల్లడించారు. బెంగళూరులోని ఐబీఎం సీఎస్ఆర్ అకడమియా మనిమధుకర్ మాట్లాడుతూ విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్ నైపుణ్యాలు నేర్చుకోవాలంటే ప్రాథమికంగా ప్రోగ్రామింగ్ గురించి తెలిసి ఉండాలన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పీఎంవీ రావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదులకు నిర్దేశిత గడువులోగా పరిష్కారం

అధికారులకు అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదేశం


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు

నెహ్రూనగర్: స్పందనలో ప్రజల నుంచి అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులో పరిష్కారమయ్యేలా విభాగాధిపతులే నేరుగా పరిశీలించి, పరిష్కరించాలని పెద్ది రోజా ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అందే ఫిర్యాదుల్ని బాధ్యతతో పరిష్కరించాలని, విభాగాల వారీగా అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, పరిష్కారం అనంతరం వారికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని తెలిపారు. వార్డు సచివాలయాల్లో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులందరూ అందుబాటులో ఉండాలని ఆమె ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 25 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 7, ఇంజినీరింగ్ విభాగానికి 11, రెవెన్యూ విభాగానికి 5, ప్రజారోగ్య విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, డి.రవీంద్ర, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, బయాలజిస్ట్ మధుసూదన్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

వీనుల విందుగా సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. సినీ నటుడు చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. చిరంజీవి నటించిన చిత్రాల్లోని పాటల్ని గాయకులు ప్రసాదరావు, శెట్టి థామస్, పి.శ్రీనివాసరావు, పి.మోహన్, సీహెచ్.వాసు, బి.శ్రీనివాసరావు, ఎన్.సత్యనారాయణ, బి.నరేష్, రత్నం, జబి ఆలపించారు. సభకు చిరంజీవి యువత జాతీయ అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాపునాడు జోన్-3 అధ్యక్షుడు బొందలపాటి వెంకట్రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చందు సాంబశివరావు, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, సేవా సదన్ వ్యవస్థాపకుడు మిరియాల గోపీకుమార్ పాల్గొన్నారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి



గుంటూరు రూరల్: గుండెపోటుతో కార్మికుడు మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా, ముప్పాళ్ళ మండలం ఇరుకుపాలెం గ్రామానికి చెందిన బత్తుల కోటేశ్వరరావు (50) మిర్చి యార్డులో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో యథావిధిగా యార్డులో పనికి వచ్చాడు. అనంతరం పనిచేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి, అతనిని ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడు. సమాచారం తెలిసిన నల్లపాడు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని, పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

చేబ్రోలు: మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి, వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై పొన్నూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన బాలికను జడవల్లి గ్రామానికి చెందిన యువకుడు మిక్కిలి రాఘవేంద్ర ప్రేమ పేరుతో అనేకసార్లు బలవంతంగా లైంగిక వేధింపులకు గురిచేశాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు రాఘవేంద్రపై అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హసీమ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

లక్ష్మీపురం: ఇన్నర్ రింగ్ రోడ్డు రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. మృతుడి వయస్సు 50 దాకా ఉంటుంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల వారిని విచారించినా, వివరాలు తెలియలేదు. గుర్తు తెలియని రైలు ఢీకొని ఉంటుందని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రా సుపత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం పంపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గుంటూరు రైల్వే జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు ఫోన్ నంబర్లు 9440627546, 0863-2220753లను సంప్రదించాలని సూచించారు.

ప్రై'వేటు'తో ప్రయాణికులు విలవిల

- నగరంలో ప్రయాణికులకు కరువైన ఆర్టీసీ సిటీ బస్సులు
- వేలల్లో తిరుగుతున్న ప్రైవేటు వాహనాలు
- ఆదాయ మార్గాలపై దృష్టి సారించని ఆర్టీసీ
- పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిటీ సర్వీసుల ఏర్పాటులో విఫలం
- కొరవడిన సరైన ప్రణాళిక, అధికారుల పర్యవేక్షణ


నగరంలో తిరుగుతున్న ప్రైవేటు సర్వీసులు, ఆటోలు

పాత గుంటూరు: శరవేగంగా విస్తరిస్తున్న గుంటూరు నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిటీ బస్సుల్ని ప్రవేశపెట్టి ఆదాయాన్ని పెంచుకునే మార్గాల వైపు ఆర్టీసీ దృష్టి సారించడం లేదు. నగరం నలుమూలలా సుమారు 20 కిలోమీటర్ల వరకు విస్తరించింది. శివారుల్లో నూతన కాలనీలు వెలిశాయి. ఇళ్ల నిర్మాణాలు ఊపందుకోవడంతో పాటు జనాభా పెరిగింది. అయితే, శివారు ప్రాంతాల ప్రజలు సరైన రవాణా వ్యవస్థ లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ సిటీ సర్వీసుల్ని ప్రవేశపెట్టి ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశాలున్నప్పటికీ ఆ దిశగా అడుగులు వేయడం లేదు.

ఉన్నతాధికారి నిర్ణయంతో సిటీ సర్వీసుల రద్దు ?

నగరంలో కొన్నేళ్ల కిందట పేరేచర్ల, నల్లపాడు, చుట్టుగుంట, ఆటోనగర్, పెద పలకలూరు, గుజ్జనగుండ్ల, కొత్తపేట, అరండల్‌పేట తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడిపింది. చార్జీలు రూ. 10, రూ.15, రూ. 20గా ఉండేవి. సరైన ప్రణాళిక, పర్యవేక్షణ లోపం వల్ల కొన్ని నెలలకే నష్టాలు వస్తున్నాయనే కారణంతో అప్పట్లో ఓ ఉన్నతాధికారి తీసుకున్న నిర్ణయంతో రద్దు చేసినట్లు సమాచారం. ఆ తరువాత సిటీ సర్వీసులను నడపడంపై ఆర్టీసీ దృష్టి సారించలేదు. దీంతో ప్రయాణికులు పూర్తిగా ప్రైవేటు వాహనాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆటోలు, ప్రైవేటు బస్సులదే హవా

ప్రస్తుతం నగరంలో 5,000 పైగా ఆటోలు, 20కు పైగా ప్రైవేటు సిటీ బస్సులు యథేచ్ఛగా తిరుగుతూ ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాయి. అయితే, ఈ విషయంలో ఆర్టీసీ విఫలమవుతుందనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, పనుల నిమిత్తం నగరానికి వచ్చే వారు, వెళ్లేవారు ప్రైవేటు సిటీ బస్సులు, ఆటోల్ని ఆశ్రయిస్తున్నారు. దూరాన్ని, సమయాన్ని బట్టి అధికంగా వసూలు చేస్తుండడంతో వీరంతా ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయం లేక అడిగినంత చెల్లించి ప్రయాణిస్తున్నారు.

బస్టాండ్ నుంచి శివారు కాలనీలకు ఆర్టీసీ సిటీ సర్వీసుల్ని ప్రవేశపెడితే బాగుంటుందని, సురక్షిత ప్రయాణంతో పాటు తక్కువ చార్జీ చెల్లించి గమ్యస్థానాలకు చేరుకోవచ్చని నగర ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఆర్టీసీ సిటీ బస్సులను ప్రవేశపెట్టాలి



నగరంలో సిటీ బస్సులు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలు, ప్రైవేటు సిటీ బస్సుల్ని ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రత్యామ్నాయం లేదు. ఆటోవాలాలు కూడా ప్రయాణాన్ని బట్టి అధికంగా వసూలు చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారు. నగర జనాభా పెరగడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజల రాకపోకలు పెరిగాయి. ఆర్టీసీ సిటీ సర్వీసుల్ని పునరుద్ధరిస్తే తక్కువ చార్జీతో సురక్షిత ప్రయాణం చేయవచ్చు.

– షేక్ జిలాని, నగరవాసి

సిటీ బస్సుల ఏర్పాటుకు చర్యలు



నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం సిటీ బస్సుల్ని నడిపే విధంగా చర్యలు చేపడతాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తాం.

–రవికాంత్, జిల్లా ప్రజా రవాణా అధికారి

క్లుప్తంగా

రేపటి నుంచి నగరపాలక సంస్థలో ఈఎస్ఐ క్యాంపు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఈఎస్ఐ శిబిరాన్ని ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులంతా కార్డుల్ని అప్డేట్ చేసుకోవాలని ఆమె సూచించారు.

ఇంట్లో చోరీ..

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. యతిరాజుల కాలనీ ఐదో లైనులో నివాసం ఉండే మేడసాని అంజమ్మ కుటుంబ సభ్యులతో కలసి ఈనెల 19న ఊరెళ్లి, తిరిగి 20న ఇంటికి చేరుకుంది. తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించగా, బీరువాలోని రూ. లక్ష నగదు, రెండు బంగారం దిద్దులతో పాటు పలు గృహోపకరణాలు చోరీకి గురైనట్లు గుర్తించింది. ఈ మేరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

నగరంపాలెం: డివిజన్ పరిధిలోని వడ్డెరగూడెం ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ తెలిపారు. ఒకటి, రెండు వీధులతో పాటు బొద్దురాయి సెంటర్ నుంచి వాటర్ ప్లాంటు వరకు రూ.50 లక్షలతో చేపట్టనున్న రోడ్ల నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, స్థానిక పెద్దలు ఎర్రబాబు, బత్తుల శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్లా, తిరుమలశెట్టి కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెదకాకాని: గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కార్యదర్శి అంగలకుదురు సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ మండల గౌరవాధ్యక్షులు నన్నపనేని శివాజీ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్మికులు మురుగు కాలవల్లో వాళ్ల ప్రాణాలు పణంగా పెట్టి పనిచేయటం వల్ల గ్రామంలో ప్రజలందరూ హాయిగా జీవిస్తున్నారన్నారు. రోజువారి కష్టపడి పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, వారి సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెలా సబ్బులు, నూనె, మాస్కులు, గ్లౌజులు యూనిఫామ్ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బురదగుంట సాంబయ్య, సంకూరు నీలాం, కోటిపల్లి సత్యనారాయణ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పెదకాకాని: ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉప్పలపాడు గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన పెద్దిపాగ జోసఫ్ తంబి గుంటూరులోని వాటర్ సర్వీసింగ్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య సుశీల, ముగ్గురు సంతానం కలరు. కొంతకాలంగా జోసఫ్ చెడు వ్యసనాలకు బానిసగా మారాడు. అతిగా మద్యం సేవించడంతో పాటు పాన్ పరాగ్‌లు నిత్యం నములుతూనే ఉండేవాడు. దీంతో అప్పడప్పుడు తట్టుకోలేని విపరీతమైన కడుపునొప్పి వస్తూ ఉండేది. ఆదివారం రాత్రి కడుపునొప్పితో జోసఫ్ బాధ పడుతూ ఉండగా భార్య సమీపంలో నివాసం ఉంటున్న అతని తండ్రి డేవిడ్‌కు తెలియజేసి, ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు వారి ఇంటికి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి జోసఫ్ తంబి(38) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సహకారంతో కిందకు దింపి, ఆసుపత్రికి తీసుకెళ్తుండగా.. మార్గమధ్యంలోనే అతను మృతి చెందాడు. మృతుని తండ్రి డేవిడ్‌రాజు ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

మద్యం సీసాలు ధ్వంసం

మేడికొండూరు: మండల పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యం సీసాలను మేడికొండూరు పోలీసులు సోమవారం ధ్వంసంచేశారు. మండల పరిధిలోని పేరేచర్ల - గుంటూరు బ్రాంచ్ కెనాల్ సమీపంలో సీఐ కె.వాసు సమక్షంలో 33 మద్యం బాటిళ్లు ధ్వంసం చేశారు. సీఐ వాసు మాట్లాడుతూ మండలంలోని పలు కేసుల్లో పట్టుబడ్డ మద్యం బాటిళ్లు పొక్లెయినర్‌తో ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఏఎస్ఐ శ్రీనివాసరాజు, కానిస్టేబుళ్లు సిద్ధు, ఇమ్రాన్‌వలి పాల్గొన్నారు.

నాగపంచమి ప్రత్యేక పూజలు

ఫిరంగిపురం: మండలంలోని పలుగ్రామాల్లో ఆలయాల్లో సోమవారం నాగపంచమిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలోని పుట్టవద్ద, వేములూరిపాడులోని పుట్టవద్ద, 113 తాళ్లూరులోని శివాలయం వద్దనున్న పుట్టవద్ద భక్తులు పెద్ద ఎత్తున వచ్చి పుట్టలో పాలుపోసి, సజ్జలు, చలిపిండి నివేదనగా పెట్టారు.

'కళ్ళం'లో జాతీయస్థాయి సాంకేతిక సదస్సు వాల్ పోస్టర్ల విడుదల


వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న కళాశాల డైరెక్టర్, డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి

గుంటూరు రూరల్: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నతంగా రాణించాలని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో సెప్టెంబర్ 15, 16 తేదీలలో నిర్వహించనున్న జాతీయ స్థాయి విద్యార్థుల సాంకేతిక సదస్సు గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ సంకల్ప్ 2024 పేరుతో జాతీయ స్థాయిలో సాంకేతిక సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి ఈ సదస్సుకు వేలాదిగా ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొంటారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సులో సాంకేతిక, మేనేజ్‌మెంట్, క్రీడలు తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పో, క్విజ్, హకతాన్, కోడ్ సిఫర్, పేపర్ ప్రజంటేషన్, ట్రెజరర్ హంట్, క్రీడల్లో క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, త్రోబాల్, టెన్నిస్, క్యారమ్స్, చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు రూ.4 లక్షలకు పైగా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామన్నారు. సదస్సు కన్వీనర్‌గా డాక్టర్ జేవీకే రత్నం, కో-కన్వీనర్‌గా డాక్టర్ వెంకటరావు, డాక్టర్ పి.రత్నబాబు, డాక్టర్ సీహెచ్ శ్యామలాదేవి వ్యవహరిస్తారని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు


మలేరియా సబ్ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మలేరియా సబ్ యూనిట్ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆయా అంటు వ్యాధులపై ప్రజలకు ముందస్తు జాగ్రత్తలను సూచించాలని కోరారు. ఈక్రమంలో మలేరియా సబ్ యూనిట్ కార్యాలయానికి మండల పరిషత్‌లోని గదిని కేటాయించి తమ ఇబ్బందులను తీర్చినందుకు వైద్య సిబ్బంది ఎమ్మెల్యే ఆర్కేకు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు డాక్టర్ పి.అనూష, డాక్టర్ సత్యవతి, డాక్టర్ ప్రియాంక, మలేరియా అధికారి శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్లు సాగర్, సైదులు, జయలక్ష్మి, శ్రీనివాసు, నరసింహారావు, జాన్ ఫెన్నీ, నరసింహమూర్తి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు

తాడికొండ: పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందని, వారిని పార్టీ అక్కున చేర్చుకుంటుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, పార్టీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి చెప్పారు. తాడికొండలోని శ్రీ సాయిబాబా కల్యాణ మండపంలో సోమవారం జేసీఎస్ కన్వీనర్లకు జీవిత బీమా నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడారు. రానున్న రోజుల్లో జేసీఎస్ కన్వీనర్లది కీలకపాత్ర కానున్నట్లు చెప్పారు. వారి పనితీరును గుర్తుపెట్టుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 10 లక్షల వరకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తోందన్నారు. గత ప్రభుత్వం పార్టీ నాయకుల్ని, కార్యకర్తలని వాడుకుని వదిలేసిందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏ ఒక్కరిని కూడా వదిలిపెట్టదని వారికి తగిన న్యాయం చేస్తోందని వెల్లడించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన నాటి నుంచి ఎల్లో మీడియా అసత్య ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. ఏ మంచి కార్యక్రమం తలపెట్టినా అడ్డగోలు రాతలు రాస్తూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారని ఆరోపించారు. అయినప్పటికీ ప్రజలు నిజాలు గ్రహిస్తున్నారన్నారు. అందుకు నిదర్శనం ఇప్పుడు జరిగిన పంచాయతీ ఎన్నికల ఫలితాలేనన్నారు. ప్రతి గడపలోను సంక్షేమ వెల్లివిరుస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 లక్షల ఇళ్ల స్థలాలు ఇస్తే, రాజధానిలో 51 వేల మంది పేదలకి ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. ఇది చూసి ఓర్వలేక టీడీపీ నేతలు కోర్టులకు వెళుతున్నారని విమర్శించారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే మురికివాడలుగా మారుతాయి అని అనటం వెనుక వారికి పేదల పట్ల ఉన్న చులకనభావం ఏంటో అర్థం అవుతోందన్నారు. టీడీపీ హయాంలో ఏ పథకాన్ని సక్రమంగా అమలు చేయలేదని, ఏ ఒక్కరికి సెంటు భూమి కూడా ఇవ్వలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జేసీఎస్ కన్వీనర్లు కీలకపాత్ర వహించాలన్నారు. పలువురు జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

26న 'పంచుకుందాం రా' పుస్తకంపై చర్చా వేదిక

తెనాలి: 'ఆహ్వానం లక్ష్మి' సంస్మరణలో భాగంగా ఈనెల 26న కవి, సామాజిక ఉద్యమాల కార్యకర్త కృపాకర్ మాదిగ కవిత్వం 'పంచుకుందాం రా' పుస్తకంపై చర్చా వేదిక జరగనుంది. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం 6 గంటలకు కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటయే సభకు కె.వి. రాఘవరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. దళిత ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా వైస్ చాన్సలర్ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ప్రారంభించే చర్చలో ప్రముఖ సాహితీ విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య, ఆచార్య పొన్నెకంటి రత్నాకర్, రచయిత్రి గంగవరపు సునీత, కవి కృపాకర్ మాదిగ పాల్గొంటారు. గత ఏప్రిల్ 17న మృతి చెందిన 'ఆహ్వానం లక్ష్మి'కి నివాళిగా ఏడాదిపాటు ప్రతినెలా ఒక మంచి పుస్తకంపై చర్చను జరపాలని భిన్నస్వరాలు తీర్మానించుకుంది. ఆ ప్రకారం నెలనెలా చర్చావేదికను నిర్వహిస్తోన్న విషయం తెలిసిందే.

ముస్లింలకు రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యం

మేయర్ కావటి మనోహర్ నాయుడు


అధికారులతో కలసి మ్యాపును పరిశీలిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు రాజకీయంగా, సామాజికంగా అధిక ప్రాధాన్యత ఇస్తోందని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం మజ్లీస్ ఉలామా జమైత్ ఉలామా ఆర్గనైజేషన్‌కు స్థలం కేటాయించడానికి గానూ నగరంలోని బీఆర్ స్టేడియం తూర్పు వైపు గల ఖాళీ స్థలాన్ని, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద గల రెడ్ ట్యాంక్ పడమర వైపు గల ఖాళీ స్థలాన్ని నగర పాలక సంస్థ అధికారులు, ముస్లిం మత పెద్దలతో కలసి మేయర్ పరిశీలించారు. తొలుతగా ఖాళీ స్థలాల మ్యాప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మజ్లీస్ ఉలామా జమైత్ ఉలామా ఆర్గనైజేషన్ సభ్యులు, ముస్లిం మత పెద్దలు కొన్ని రోజుల కిందట తనను కలసి పేద ముస్లిం విద్యార్థులకు అందిస్తున్న సేవల గురించి వివరించారన్నారు. శాశ్వత భవనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నగరపాలక సంస్థ ఖాళీ స్థలాన్ని కేటాయించాలని వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బీఆర్ స్టేడియం తూర్పు గల ఖాళీ స్థలాన్ని, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ రెడ్ ట్యాంక్ పడమర వైపు గల ఖాళీ స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతికి లెటర్ రాస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, కార్పొరేటర్ షేక్ మీరావలి, పార్టీ నేత షేక్ నూరి ఫాతిమా, నగరపాలక సంస్థ సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ముస్లిం మత పెద్దలు ముఫ్తీ అబ్దుల్ బాసీద్, ముఫ్తీ ఆసిఫ్, అబ్దుల్ గఫార్, హాఫీజ్ అబ్దుల్ ఖాదీర్, ముఫ్తీ అబ్దుల్ కవి, మౌలానా ఇస్మాయిల్, ముఫ్తి రహమతుల్లా, అధికారులు పాల్గొన్నారు.

కాకుమానువారితోటలో జీజీహెచ్ ఓపీ సేవలకు సన్నాహాలు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి స్థానిక కాకుమానువారితోటలో కేటాయించిన ఆరు ఎకరాల స్థలాన్ని సోమవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మ, డెంటల్, మానసిక విభాగాలకు జీజీహెచ్‌లో సరిపడా స్థలం లేకపోవడంతో ఆయా విభాగాలకు కాకుమానవారితోటలో భవనాల్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇక్కడే ఓపీ సేవలను ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. స్థలం కబ్జా కాకుండా రూ. 2 కోట్లతో కాంపౌండ్ వాల్ నిర్మించాలని డీఎంఈకి లేఖ రాశామన్నారు. డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్ పాల్గొన్నారు.